క్లుప్తంగా

18నుంచి మునిస్వామి ఉరుసు



నల్లగుండ్లలో నూతనంగా నిర్మించిన ముఖద్వారం

తుగ్గలి : ఈ నెల 18వ తేదీ నుంచి మూడు రోజుల పాటు మండలంలోని నల్లగుండ్లలో ముని స్వామి (హాజరత్ సయ్యద్ మునీర్ బాషా) ఉర్సు ఉరుసు నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 18న గంధం, 19న ఉరుసు, 20న జియారత్ కార్యక్రమాలు ఉంటాయన్నారు. 19న గ్రామానికి చెందిన కుసినేని శేఖర్ సహకారంతో నూతనంగా నిర్మించిన ముఖ ద్వారాన్ని ఎమ్మెల్యే కేఈ శ్యాం కుమార్ ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఉరుసు సందర్భంగా 18 నుంచి 19వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు ఏర్పాటు చేశామన్నారు. విజేతలకు వరుసగా రూ.20,016, రూ.15,016, రూ.10,016, రూ.5,016 నగదు బహుమతులను అందజేయనున్నట్లు వెల్లడించారు. అలాగే చెక్క భజన ఉంటుందని వివరించారు.

ధనుర్మాస పూజలు పరిసమాప్తి



ప్రత్యేక అలంకరణలో సిద్ధేశ్వరస్వామి ఉత్సవమూర్తి

హొళగుంద: మండల కేంద్రంలో వెలిసిన సిద్ధేశ్వరస్వామికి మంగళవారం ధనుర్మాసం ముగింపు పూజలు ఘనంగా జరిపించారు. ఈ ఆలయంలో ప్రత్యేక రుద్రాభిషేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు స్వామికి జలాభిషేకం, ఆకుపూజా, కుంకుమార్చన, సహస్ర బిల్వార్చన, పంచామృతభిషేకం తదితర పూజలు చేపట్టారు.

రేపు వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం

ఆలూరు: స్థానిక ఉమాకల్యాణ మండపంలో ఈనెల 17వ తేదీన వైఎస్సార్‌సీపీ మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీ, వైస్ ఎంపీపీ, సింగిల్‌విండో మాజీ డైరెక్టర్లు, నాయకులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆలూరు మండల అధ్యక్షుడు కె. మల్లికార్జున బుధవారం తెలిపారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి, వైకుంఠం మల్లికార్జున చౌదరి, జిల్లా మహిళా అధ్యక్షురాలు శశికళ, విద్యాంగుల సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు తదితరులు హాజరు కానున్నట్లు చెప్పారు. కోరారు.

బాలయేసు పుణ్యక్షేత్ర మహోత్సవాలు



ప్రసంగిస్తున్న మత గురువులు

మద్దికెర : స్థానిక రోమన్ కాథలిక్ చర్చి బాలయేసు పుణ్య క్షేత్ర మహోత్సవాల్లో భాగంగా మంగళవారం బాలయేసు చర్చి ఉత్సవాలను మత గురువులు, క్రైస్తవులు వైభవంగా నిర్వహించారు. ఉదయం 6 గంటలకు స్తుతి ప్రార్థనలు, దివ్య సత్ప్రసాద ఆరాధన, వ్యాధిగ్రస్తుల కోసం ప్రార్థనలు చేశారు. అనంతరం ఆంథోని పూల సమష్టి బలి పూజలు నిర్వహించి మేత్రాణులను సన్మానించారు. సాయంత్రం బాలయేసు స్వరూపాన్ని గ్రామంలో ఊరేగించారు.

జాతరలో దొంగల చేతి వాటం

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలో బుధవారం సాయంత్రం జరిగిన శ్రీ నీలకంఠేశ్వర స్వామి రథోత్సవంలో దొంగలు చేతివాటం ప్రదర్శించారు. భక్తులకు చెందిన 11 తులాలకు పైగా బంగారు అభరణాలు చోరీకి గురయ్యాయి. జాతరను తిలకించేందుకు వచ్చిన వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి మెడలో నుంచి దొంగలు బంగారు చైన్లు, పుస్తెలను లాక్కెళ్లారు. పట్టణానికి చెందిన సోమశేఖర్ మెడలోని 2 తులాల బంగారు చైన్, వీరయ్య శెట్టి మెడలో 3 తులాల చైన్, హైదరాబాద్ నుంచి జాతరకు వచ్చిన నవతి మెడలోని 4 తులాల తాళిబొట్టు, చైన్, బంగారు అభరణాలు, కోడుమూరకు చెందిన రాజశేఖర్ మెడలోని తులం చైన్, డాలర్ కత్తిరించుకొని వెళ్లారు. అలాగే పట్టణానికి చెందిన కృష్ణారెడ్డి మెడలో తులం చైన్, డాలర్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు. జాతరలో నిమిషాల వ్యవధిలో దొంగలు చోరీలకు పాల్పడటంతో బాధితులు లబోదిబో మంటున్నారు. అయితే జాతర సందర్భంగా ఇతర ప్రాంతాల నుంచి దొంగలు వచ్చినట్లు తెలుస్తుందని పోలీసులు అభిప్రాయపడుతున్నారు. అలాగే సెల్ ఫోన్లు కూడ చోరీకి గురైనట్లు తెలుస్తోంది. బంగారు చోరీకి గురైన బాధితులు పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

క్రికెట్ విజేతలకు బహుమతుల ప్రదానం

ఆదోని రూరల్: ఆదోని ఛాంపియన్ ట్రోఫీ ఆర్గనైజర్ ముజీబ్‌అహ్మద్ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని సాంబగల్ క్రికెట్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో ఘాజీ-11 జట్టుపై కల్లుబావి కింగ్స్ విజయం సాధించింది. ఈ సందర్భంగా మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జైభీమ్ సాయిరామ్ ఎగ్బాల్ చేతులమీదుగా అందజేశారు. ఎంఎండీ సహారా యాసిన్‌బాషా, కల్లుబావి కింగ్స్ టీం కెప్టెన్ చంటి, వంశీ, సమర, వీరేశ, నాగరాజు, ఈరన్న, గోవిందరాజులు, ఆంజనేయులు, శేఖర్, శాంతరాజ్ తదితరులు పాల్గొన్నారు.

శనగ పైరుకు బూడిద తెగులు

- కోత దశలో నల్లగా మారిన పంట
- సబ్ డివిజన్‌లో 46 వేల హెక్టార్లలో సాగులో ఉన్న శనగ
- వైరస్‌తో 15 వేల హెక్టార్లకు పైగా పంట నష్టం



మొలగవల్లి పొలాల్లో బూడిద తెగులు సోకడంతో నల్లగా మారిన శనగ పైరు

ఆలూరు రూరల్: అన్నదాతకు ఈ ఏడాది సాగు కలిసిరాలేదు. అనావృష్టి, అతివృష్టి, తెగుళ్ల ఖరీఫ్‌లో పంటలు నష్టపోయారు. రబీలోనైనా గట్టెక్కుదామని అధిక శాతం శనగ సాగు చేశారు. 20 రోజుల క్రితం కురిసిన మోస్తరు వర్షాలతో శనగ పంటకు బూడిద తెగులు సోకింది. దీంతో పైరు నల్లగా మారిపోతోంది. పంటలు చేతికందే దశలో తెగులు సోకడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పెట్టుబడి కూడా దక్కే పరిస్థితులు కనిపించడం లేదని వాపోతున్నారు. ఆలూరు వ్యవసాయ సబ్ డివిజన్‌లో ఈ ఏడాది రబీ సీజన్‌లో రైతులు 46 వేల హెక్టార్లలో పప్పు శనగ పంట వేశారు. ఎకరాకు రూ.30 వేలు పెట్టుబడి పెట్టి సాగు చేశారు. పంటకు బూడిద రంగు వైరస్ వ్యాపించడంతో పైరు మొత్తం నల్లగా మారుతోంది.

10 వేల హెక్టార్లకు పైగా పంట నష్టం..

ఆలూరు వ్యవసాయ సబ్ డివిజన్‌లో ఈ ఏడాది 46 వేల హెక్టార్లలో శనగ పంట సాగైనట్లు వ్యవసాయ శాఖ అధికారులు వెల్లడించారు. ఇందులో 15 వేల హెక్టార్ల పంటకు బూడిద రంగు వైరస్ సోకింది. పంట కోత దశలో చేరడంతో ఎలాంటి పురుగుల మందులు పిచికారీ చేసినా ఫలితం లేదని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. మొత్తానికి దాదాపు 10వేల హెక్టార్లలో పంట నష్టపోయే అవకాశముందని పేర్కొంటున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



నాకు ఉన్న 4 ఎకరాల్లో శనగ పంట సాగు చేశాను. ఎకరాకు రూ.30 వేలు ఖర్చయ్యింది. రెండు నెలల వరకు పంట బాగా ఉండింది. నెల రోజుల క్రితం కురిసిన వర్షాలు, ప్రస్తుతం కురుస్తున్న మంచుతో శనగ పంటకు తేమ శాతం ఎక్కువై పైరంతా నల్లగా మారింది. ఎకరాకు క్వింటం దిగుబడి కూడా వచ్చేలా లేదు. ఎకరాకు రూ.420 చొప్పున పంటల బీమా ప్రీమియం చెల్లించాను. ప్రభుత్వం విచారించి నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలి.

– చంద్రశేఖర్ రైతు,మొలగవల్లి

హైవే-167 పనులు చేపట్టండి



ఆలూరులో అసంపూర్తిగా ఉన్న హైవే- 167ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విరూపాక్షి

ఆలూరు రూరల్: ఆలూరు పట్టణంలో అసంపూర్తిగా ఉన్న హైవే -167 పనులు చేపట్టాలని ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి డిమాండ్ చేశారు. స్థానికుల వినతి మేరకు బుధవారం ఆయన స్థానిక ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయం ముందు ఉన్న హైవేను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. పట్టణం నడిబొడ్డులోని రహదారిలో మోకాటిలోతు గుంతలు ఉన్నా కూటమి నాయకులు, అధికారులకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. ప్యాచ్ వర్క్‌ల పేరుతో కోట్లు దండుకుని సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. దుమ్ము ధూళి మధ్య గ్రామస్తులు నిత్యం రాకపోకలు సాగిస్తూ ఇబ్బంది పడుతున్నా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. రహదారి నిర్మాణ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.

నివాళి..

మాజీ ఎంపీటీసీ, వైఎస్సార్‌సీపీ మండల సీనియర్ నాయకుడు హనుమంతప్ప (45) మృతి పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే విరూపాక్షి అన్నారు. మండలంలోని మరకట్టు గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ హనుమంతప్ప బుధవారం తెల్లవారు జామున గుండెపోటుతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గ్రామానికి వెళ్లి మృతదేహం పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి పరామర్శించి దహన సంస్కారాలకు రూ.10 వేలు అందించారు. వైఎస్సార్ సీపీ కర్నూలు జిల్లా వికలాంగుల విభాగం అధ్యక్షుడు రామాంజనేయులు,ఎంపీటీసీ దేవరాజు, నాయకులు ఎల్లప్ప, ఓబులేషు, గుండయ్య,వీరేష్ ఉన్నారు.

ఉత్సవాలను జయప్రదం చేయండి

హొళగుంద: మండల ప్రజలతో పాటు కర్ణాటక సరిహద్దు ప్రాంతాలకు ఆరాధ్యదైవంగా పూజింపబడుతున్న హొళగుంద సిద్దేశ్వరస్వామి ఉత్సవాలకు భక్తులు తరలివచ్చి జయప్రదం చేయాలని ఆలయ వంశపారంపార్య ధర్మకర్త రాజ పంపన్న గౌడ్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆలయ ఆవరణలో గ్రామపెద్దలతో కలిసి ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు.ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 13వ తేదీ నుంచి మొదలయ్యే ఉత్సవాలకు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. 2న ఆదివారం సిద్దేశ్వరస్వామికి కంకణధారణ, 5న నంది ఉత్సవం,6న గజోత్సవం, 7న రథోత్సవం, 8న లంకాదహనం, 9న వసంతోత్సవ కార్యక్రమంతో ఉత్సవాలు ముగుస్తాయని వివరించారు. గ్రామపెద్దలు శివశంకర్‌గౌడ్, సిద్దార్థ గౌడ్, మురళి, ఊకూరు కాడసిద్దప్ప, డాక్టర్ తిప్పయ్య, కోట్రేష్, అమరప్ప, ఈశ్వరప్ప పాల్గొన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నీ



విజేత జట్టుకు ట్రోఫీ అందిస్తున్న నాయకులు



విజేత విరాట్ లెవెన్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న దృశ్యం

వెల్దుర్తి: సంక్రాంతి పురస్కరించుకుని బొమ్మన శివ శంకర్ రెడ్డి స్మారకార్థం స్థానిక బాలుర హైస్కూల్ మైదానంలో నిర్వహించిన సూపర్-8 మండల స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌లో పట్టణానికి చెందిన యశ్వంత్ ఎలెవెన్ జట్టు విన్నర్‌గా నిలిచింది. ఈనెల 11న ప్రారంభమై, 25 జట్లు పాల్గొన్న ఈ టోర్నీ ఫైనల్‌లో వెల్దుర్తి యశ్వంత్ ఎలెవెన్, వెల్దుర్తి ఐజీ నగర్ కింగ్స్ జట్లు చేరుకున్నాయి. బుధవారం ఐజీ నగర్ జట్టు టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకోగా యశ్వంత్ ఎలెవెన్ జట్టు నిర్ణీత ఓవర్లలో 100 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన ఐజీ నగర్ 50 పరుగులకు ఆలౌట్ కాగా విన్నర్‌గా నిలిచిన యశ్వంత్ జట్టు రూ.10,116 నగదు బహుమతి గెలుచుకుంది. రన్నర్స్ జట్టు రూ.5,116 అందజేశారు.

హొళగుంద: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల మైదానంలో మూడు రోజులుగా జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్ బుధవారం ముగిసింది. ఫైనల్ మ్యాచ్‌లో విజేతగ విరాట్ లెవెన్ జట్టు నిలిచింది. మండల కేంద్రానికి చెందిన ఎరుకుల దేవేంద్ర, బసవ అనే క్రీడాకారులు జ్ఞాపకార్థం ఎస్ఐ బాల నరసింహులు, గ్రామపెద్దలు పంపన్నగౌడ్, డాక్టర్ తిప్పయ్య, హెచ్ఎం నజీర్ అహమ్మద్ సహకారంతో నిర్వహించిన పోటీల్లో ఓజీ లెవెన్, విరాట్ లెవెన్ జట్లు ఫైనల్‌లో తలపడ్డాయి. విజేత జట్టుకు రూ.10 వేలు, రన్నర్ జట్టుకు రూ.5 వేలను పారిశ్రామికవేత్త రాజాగౌడ్ తరపున గ్రామపెద్దలు అందజేశారు. నిర్వాహకులు వారీక్, అమానుల్లా, శీను, సిద్దప్ప, అశోక్, అబ్దుల్ రవూఫ్, మల్లి పాల్గొన్నారు.

నేటి నుంచి జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీ

కృష్ణగిరి (వెల్దుర్తి): స్థానిక బాలుర హైస్కూల్ మైదానంలో ఈనెల 16వ తేదీ నుంచి జిల్లా స్థాయి సూపర్-8 క్రికెట్ టోర్నమెంట్ జరుగనుంది. 2000-01 బ్యాచ్ పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ టోర్నీ విన్నర్స్‌కు రూ.20వేలు, రన్నర్స్‌కు రూ.10వేలు అందజేయనున్నారు. ఎంట్రీఫీజు రూ.500తో గురువారం 10గంటలలోపు సెల్ 9052997711, 9391610171 నంబర్లలో సంప్రదించాలని నిర్వాహకులు సురేశ్, శ్రీను, సుమన్, రాహుల్, అనూప్, సూరి, ముత్యాల సుమన్ బుధవారం తెలిపారు.

20న ఎమ్మిగనూరులో పెన్షనర్ల సమావేశం

పత్తికొండ(తుగ్గలి) : ప్రభుత్వ పెన్షనర్ల సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని ఈ నెల 20వ తేదీన ఎమ్మిగనూరులోని ఉప్పర కల్యాణ మండపంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు మంగళవారం పత్తికొండకు విచ్చేసిన సంఘంరాష్ట్ర సహాధ్యక్షుడు జి.అబ్దుల్ కరీంను సంఘం పత్తికొండ అధ్యక్షుడు టీఎండీ హుసేన్, కార్యదర్శి జయరాములు, ట్రెజర్ ప్రతాప్ నాయకులు పెద్దయ్య, బ్రహ్మయ్య, శ్రీనివాసులు, కృష్ణారెడ్డి సన్మానించారు. రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి పెన్షనర్లందరూ హాజరై విజయవంతం చేయాలని కోరారు.

స్కూల్ ల్యాబ్ అసిస్టెంట్ మృతి

హొళగుంద: ఇంగళదహాళ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ల్యాబ్ అసిస్టెంట్ గౌస్‌పీర (61) బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. కొన్నాళ్ల నుంచి అనారోగ్యంతో బాధ పడుతుండేవాడు. ఈ క్రమంలో బళ్లారిలో చికిత్స పొందుతూ బుధవారం ఉదయం కోలుకోలేక మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతిపై హెచ్ఎం జనార్ధనయ్య, టీచర్లు ప్రగాఢ సంతాపం తెలిపారు.



లక్ష్మన్నను పరామర్శిస్తున్న స్నేహితులు

స్నేహమంటే ఇదేరా !

పత్తికొండ(తుగ్గలి) : వారంతా కలిసి మెలిసి చదువుకున్నారు. వారిలో ఒకరు తీవ్ర అనారోగ్యానికి గురై ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. విషయం తెలుసుకున్న చిన్ననాటి స్నేహితులు స్పందించి ఆయనకు అండగా నిలిచారు. పత్తికొండ ప్రభుత్వ బాలుర ప్రభుత్వ పాఠశాలలో హోసూరు లక్ష్మన్న 1988-89 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివారు. గ్రామంలో చౌక దుకాణం డీలర్ నిర్వహిస్తున్న ఆయన ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై తీవ్ర అనారోగ్యం బారినపడ్డారు. కుటుంబ పెద్ద మంచాన పడటంతో మానసికంగా, ఆర్థికంగా ఇబ్బందులు ఎదురయ్యాయి. విషయం తెలుసుకున్న చిన్ననాటి స్నేహితులు స్పందించారు. మంగళవారం సంక్రాంతి పండుగ రోజు లక్ష్మన్న ఇంటికి వెళ్లి పరామర్శించారు. పోగు చేసిన రూ.50వేలను కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆపదలో అండగా నిలిచిన స్నేహితులకు లక్ష్మన్న కృతజ్ఞతలు తెలియజేశారు.

కబడ్డీ విజేత బల్లేకల్లు



బల్లేకల్లు జట్టుకు షీల్డ్, బహుమతి అందజేస్తున్న దృశ్యం

ఆస్పరి: సంక్రాంతి పండుగా సందర్భంగా ఆస్పరి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిర్వహించిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో విజేతగా ఆదోని మండలం బల్లేకల్లు జట్టు నిలిచింది. బుధవారం ఫైనల్‌లో బల్లేకల్లు, నాగనాథహళ్లి జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. విజేత జట్టుకు సర్పంచ్ మూలింటి రాధమ్మ రూ. 20,116 నగదు, షీల్డ్ అందజేశారు. రెండో స్థానంలో నిలిచిన జట్టుకు అసోసియేషన్ సభ్యులు రూ. 10,116, మూడో బహుమతి కైరుప్పల జట్టుకు దాత మేకల రంగనాథ్ రూ. 5,116 అందజేశారు. కేడీసీసీ బ్యాంకు జిల్లా మాజీ డైరెక్టర్ మూలింటి రాఘవేంద్ర, నిర్వాహకులు, గ్రామ పెద్దలు సతీష్, రామకృష్ణ, మహేష్, అరవింద్, నరసింహా, రవి, నరసప్ప, మల్లికార్జున, బాలు, సంజన్న పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం



దాతకు ప్రసాదాలను అందజేస్తున్న దృశ్యం

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకంద గ్రామంలో వెలసిన ఈరన్న స్వామి దేవాలయంలో చేపడుతున్న నిత్యఅన్నదానానికి మంగళవారం భక్తులు విరివిగా విరాళాలు అందజేసి తమ భక్తిని చాటుకున్నారని ఆలయ డిప్యూటీ కమిషనర్ విజయరాజు తెలిపారు. పెద్దవాడుగూరు (అనంతపురం) వాస్తవ్యులైన బసవరాజు వారి కుటుంబ సభ్యులు రూ.లక్ష లను దేవాలయ కార్యాలయంలో ఆన్‌లైన్ రూపంలో అందజేశారు. దాతలకు ఆలయ అధికారులు స్వామి వారి శేష వస్త్రాలు, లడ్డులను, బాండును, ఫొటోను అందచి సత్కరించారు.



బాలికకు బహుమతి అందజేస్తున్న దృశ్యం



మ్యూజికల్ చైర్స్ ఆటలో పాల్గొన్న మహిళలు



ఇళ్ల ముందు ముగ్గులు వేస్తున్న చిన్నారులు



కలుగొట్లలో అవధూత రామిరెడ్డి తాత చిత్రపటానికి గ్రామోత్సవం



మద్దికెరలో ఇళ్ల ముందు రంగవల్లులు

సందడిగా సంప్రదాయ పండుగ

- ముగిసిన సంక్రాంతి సంబరాలు
- కనుమ సందర్భంగా పల్లెల్లో క్రీడా పోటీలు
- ఉల్లాసంగా సాగిన ముగ్గుల పోటీలు
- విజేతలకు బహుమతుల పంపిణీ



ముగ్గును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విరూపాక్షి



పెద్దహుల్తిలో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

ఆలూరు రూరల్: సంప్రదాయ పండుగ సంక్రాంతి కనుమతో బుధవారం ముగిసింది. ఊరువాడా సంక్రాంతి పండుగను మంగళవారం ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ప్రతి ఇంటా అలంకరించిన ముగ్గులు ఆకర్షించాయి. ఆయా గ్రామాల్లో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. మండలంలోని తుంబళబీడు గ్రామంలో సంక్రాంతి సందర్భంగా సర్పంచ్ సోమేశ్వరమ్మ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. గ్రామానికి చెందిన అమృత్,ఉషా అనే బాలికలు వేసిన వేంకటేశ్వర స్వామి ముగ్గు చూపరులను ఆకట్టుకుంది. మండలంలోని హత్తిబెళగల్ పెద్దహోతూరు, అరికెర,మొలగవల్లి, కమ్మరచేడు,కురువళ్లి, గ్రామాల ఆలయాల్లో ప్రత్యేక భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

చిప్పగిరి: ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి సొంత గ్రామమైన చిప్పగిరి లో మూడు రోజుల పాటు సంక్రాంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే విరుపాక్షి అధ్వర్యంలో గ్రామంలో ముగ్గుల పోటీలు, కబడ్డీ, కుర్చీల ఆట తదితర పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

పత్తికొండ/తుగ్గలి : సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక అయిన సంక్రాంతి పండుగను మూడు రోజుల పాటు ప్రజలు సంతోషంగా జరుపుకున్నారు. ఇంటి ముందు వేకువజామునే మహిళలు కల్లాపి చల్లి రంగురంగుల ముగ్గులు వేశారు. ఇళ్లలో పూజలు చేసుకున్న అనంతరం ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామికి మొక్కులు చెల్లించుకున్నారు. పండుగ సందర్భంగా మంగళవారం పెద్దహుల్తిలో మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి సైన్యం ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. విజేతలకు సర్పంచ్ కోలంట్ల విజయలక్ష్మి, నాగరాజుయాదవ్ దంపతులు, సైన్యం సభ్యులు రైస్‌కుక్కర్లు బహుమతిగా అందజేశారు. సీపీఐ ఆధ్వర్యంలో దూదేకొండలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రామచంద్రయ్య హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు.

తుగ్గలి మండలంలో..

మండల వ్యాప్తంగా సంక్రాంతి పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. రామలింగాయపల్లిలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో ముగ్గుల పటోటీలు నిర్వహించారు. విజేతలకు నబిరసూల్ చీరలు, మిక్సీలు, కుక్కర్, వాటర్ క్యాన్లను అందజేశారు.

కృష్ణగిరి: తెలుగువారి అతి పెద్ద పండుగైన సంక్రాంతి వేడుకలను ప్రజలు ఊరూరా సంబరంగా చేసుకున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో మహిళలు ఇంటి ముందు రంగువల్లులు, వాటి మధ్య గొబ్బెమ్మలు ఉంచి సంప్రదాయం ఉట్టిపడేలా ప్రాముఖ్యతను చాటారు. సద్దరొట్టె, వేరుశనగ ఉండలు, ఇతర పిండి వంటకాలతో ఇళ్లన్నీ ఘుమఘుమలాడాయి. ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి భోగభాగ్యాలు దక్కాలని మొక్కులు తీర్చుకున్నారు. చిన్నారులు గాలి పటాలు ఎగురవేస్తూ మురిసిపోయారు.

ఆలూరు: మూడు రోజుల పాటు వివిధ గ్రామాల్లో జరిగిన సంక్రాంతి సంబరాలు బుధవారం ముగిశాయి. మొలగవెల్లి, ఆలూరు, కురుకుంద గ్రామాల్లో విద్యార్థి ,ఐద్వా సంఘాలకు చెందిన నాయకులు మహిళలకు ముగ్గులు పోటీలు,మ్యూజికల్ చైర్స్, చిన్నారులకు వివిధ రకాలుగా ఆటల పోటీలును నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.



పెద్దహుల్తిలో విజేతలైన మహిళలతో సర్పంచ్ విజయలక్ష్మి



రామలింగాయపల్లిలో బహుమతులు అందజేస్తున్న నబిరసూల్



ఆలూరులో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు




మహిళకు బహుమతి అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

వెల్దుర్తి: భోగి, మకరసంక్రాంతి, కనుమ పండగను మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం మకర సంక్రాంతిని పిండివంటలు, పూజాదికార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో చేశారు. అదేరోజు పుల్లగుమ్మిలో గరుడ వాహనంపై సీతారామలక్ష్మణుల గ్రామోత్సవం కనుల పండువగా జరిగింది. కలుగొట్లలో అవధూత రామిరెడ్డితాత ఆరాధనోత్సవం నిర్వహించారు.

హాలహర్వి: మాచనూరు గ్రామంలో సంక్రాంతి పండగ సందర్భంగా మంగళవారం రైతు సంఘం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీ నిర్వహించారు. గెలుపొందిన అభ్యర్థులకు బహుమతులను అందజేశారు.

దేవనకొండ: సంక్రాంతి పండగ ఐక్యతకు నిదర్శమని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వీరశేఖర్, సీఐటీయూ మండల కార్యదర్శి అశోక్ పేర్కొన్నారు. సీఐటీయూ, డీవైఎఫ్ఐ, వ్యవసాయ కార్మిక సంఘం, భారత ప్రజాతతంత్ర మహిళా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక యువకులకు, మహిళలకు వివిధ ఆటల పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.



ఆస్పరి: మండలంలోని గ్రామాల్లో మంగళ, బుధవారం సంక్రాంతి సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారుజామునే ఆడపడుచులు ఇళ్ల ముందు రకరకాల ముగ్గులతో అలకంరించారు. ఆస్పరిలోని జనార్ధనస్వామి, మారెమ్మవ్వ, కన్యకాపరమేశ్వరీమాత, రామతీర్థంలోని రామలింగేశ్వరస్వామి, పంచముఖి గాయిత్రీమాత, కైరుప్పల వీరభద్రస్వామి, తంగరడోణలోని చింతలముని, నల్లారెడ్డి స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కైరుప్పల గ్రామంలో మంగళవారం ఏఐవైఎఫ్, సీపీఎం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, సీపీఎం మండల కార్యదర్శి బాలకృష్ణ ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.



పుట్లూరు మారెమ్మ



తిరుమలరాయుడు